# అక్రమ రవాణాకు గేట్‌వేగా పలమనేరు!

అక్రమ రవాణాకు పలమనేరు గేట్‌వేగా మారింది. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ ఆర్టీఓ చెక్‌పోస్టును మూసివేయడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలకు పర్మిట్లు, టాక్సులు లాంటివి ఉన్నాయా, లేదా? అని తనిఖీ చేసేవారే లేకుండా పోయారు. ఈ మార్గంలో నెలకోసారి వచ్చే ఆర్టీఓలు తూతూమంత్రంగానే వాహనాలను ఆపి తనిఖీలు చేయడం తప్పితే నిత్యం ఎన్నో వాహనాలు పన్నులు కట్టకుండా వెళ్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. పోయారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న ఈ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు అవసరం ఎంతైనా ఉంది.

- 2024లో ఆర్టీఓ చెక్‌పోస్టు మూసివేత
- వాహనాల పర్మిట్లను పరిశీలించే దిక్కు లేదు
- కర్ణాటక, తమిళనాడుకు యథేచ్ఛగా అక్రమ రవాణా
- భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి


మూతబడిన పలమనేరు ఆర్టీఓ కార్యాలయం.(ఫైల్)

**పలమనేరు:** పట్టణ సమీపంలోని రోడ్డు రవాణా కార్యాలయాన్ని గత ఏడాది మార్చిలో తొలగించారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం, యాప్ ద్వారా పన్నులు చెల్లింపును కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంతో దీనిని మూసివేశారు. ఈ కార్యాలయంలో పనిచేసే అధికారులను అదే శాఖలో స్క్వాడ్ డ్యూటీలు, హెడ్డాఫీసు విధులకు పంపేశారు.

**ఆర్టీఓ చెక్‌పోస్టు ఉన్నప్పుడు భయం ఉండేది**

గతంలో ఇక్కడ ఆర్టీఓ చెక్‌పోస్టు ఉన్నప్పుడు అన్ని వాహనాలను ఇక్కడ తనిఖీ చేసేవారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్లే వాహనాలు, అధిక టన్నేజి, పర్మిట్లు, సెస్ తదితరాల నిర్వహణ పటిష్టంగా చేసేవారు. ముఖ్యంగా మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్నట్టు గుర్తించిన డ్రైవర్లకు జరిమానాలు విధించేవారు. ఇప్పుడు చెక్‌పోస్ట్ లేకపోవడంతో అక్రమ రవాణాకు రాచబాటగా మారింది. ముఖ్యంగా కర్ణాటకకు ఎర్రచందనం, బియ్యం, తమిళనాడుకు గ్రానైట్ తదితర అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కర్ణాటక నుంచి పలు వస్తువులు, ఉత్పత్తులు పన్నులు లేకుండా జిల్లాలోకి చేరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇక్కడ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పునఃప్రారంభిస్తే ప్రభుత్వ ఖజానాకు ఆదాయంతోపాటు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది.

## క్లుప్తంగా

### నాణ్యతా ప్రమాణాలతో పనులు

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


కాలువ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

**వి.కోట :** నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరిగతిన పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని బోయచిన్నాగనపల్లెలో జెడ్పీ నిధులతో మంజూరైన డ్రైనేజీ కాలువ పనులను ఆయన మండల నాయకులతో కలసి పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నారాయణస్వామి, సర్పంచ్ జయప్ప, నాయకులు పాల్గొన్నారు.

**మృతురాలికి నివాళి**

మండలంలోని ఎస్ బండపల్లెకు చెందిన రామ్మూర్తి సతీమణి రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆ గ్రామానికి వెళ్లి మృతురాలికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### ట్రిపుల్ ఐటీకి ఇద్దరి ఎంపిక


కుషినాజ్


సబిహ

**పులిచెర్ల(కల్లూరు):** కల్లూరు జెడ్పీ హైస్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినులు కుషినాజ్, సబిహ ఎంపికయ్యారని ఆ స్కూల్ హెచ్‌ఎం శ్రీవాణి మంగళవారం తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

**పుదిపట్ల నుంచి ముగ్గురు..**


ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

**చౌడేపల్లె:** మండలంలోని పుదిపట్ల ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఎంఈఓ కేశవరెడ్డి మంగళవారం తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పదోతరగతి పాసైన సి.పూజిత, పి.జశ్విత, సిడి.మనోజ్‌కుమార్ ఎంపికైన వారిలో ఉన్నట్టు చెప్పారు. వీరిని హెచ్‌ఎం పద్మజ, టీచర్లు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

**రొంపిచెర్ల నుంచి..**


రిషిత


భరత్ కుమార్ రెడ్డి

**రొంపిచెర్ల:** మండలం నుంచి ట్రిబుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓలు శ్రీనివాసులు, ఇందిర తెలిపారు. రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల విద్యార్థిని రిషిత్ పదవ తరగతిలో 586 మార్కులు, భరత్ కుమార్ రెడ్డి 581 మార్కులు సాధించారు. వీరికి వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ కళాశాలలో ఇంజినీరింగ్‌లో సీటు వచ్చిందని తెలిపారు. వీరు ఆరేళ్ల వరకు రూపాయి ఖర్చు లేకుండా ఇంజినీరింగ్ పూర్తి చేయవచ్చన్నారు. వారిద్దరినీ ఎంఈఓలు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్ అభినందించారు.

### సర్వేయర్‌గా బాబు



**చౌడేపల్లె:** మండల సర్వేయర్‌గా బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కార్వేటినగరం నుంచి బదిలీపై చౌడేపల్లెకు వచ్చారు. ఇక్కడ కమ్యూటీ మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న గుణశేఖర్ బి.కొత్తకోటకు బదిలీ అయ్యారు. భూ సమస్యలపై రైతుల నుంచి ఫిర్యాదులందిన వెంటనే రికార్డుల ఆధారంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని బాబు చెప్పారు.

### పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- నలుగురికి తీవ్ర గాయాలు
- బోయకొండనుంచి వస్తూ ఘటన


పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

**చౌడేపల్లె:** అదుపు తప్పి పొలాల్లోకి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం చౌడేపల్లె– బోయకొండ మార్గంలోని ఊటూరు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెకు చెందిన కొందరు మొక్కుబడి చెల్లించడానికి బోయకొండకు వెళ్లారు. దర్శనానంతరం ట్రాక్టర్‌లో ఇంటికి బయలుదేరారు. ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లింది. ఈఘటనలో గంగాదేవి(35), భవాని(27), రిషి(7), ఎం.కీర్తి(7)లకు తీవ్ర గాయా లయ్యాయి. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని 108 సిబ్బంది నాగార్జున, సయ్యద్‌బాషా మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పంటల బీమా చేసుకోండి

**పుంగనూరు(చౌడేపల్లె):** ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులందరూ బీమా చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ మంగళవారం కోరారు. వేరుశనగ, వరి, రాగి, టమాట, కంది పంటలకు బీమా చేసుకోవడం ఒకవేళ పంట నష్టం వాటిల్లితే పరిహారం పొందవచ్చన్నారు. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది రైతులకు పంటల బీమా వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## మోడల్ స్కూల్లో 40మంది చేరిక


మంగళంపేట మోడల్ స్కూల్లో విలీనంతో చేరిన విద్యార్థులు

**పులిచెర్ల(కల్లూరు):** మంగళంపేట మోడల్ స్కూల్లో కొత్తగా 40 మంది విద్యార్థులు కొత్తగా చేరారని ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య మంగళవారం తెలిపారు. గతంలో ఉన్న విద్యార్థులతో కలిసి ప్రస్తుతం ఆ స్కూల్లో విద్యార్థుల సంఖ్య వందకు చేరిందన్నారు. పక్కన వున్న 1, 2 తరగతులను కూడా ఈ పాఠశాలలో విలీనం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## పశువుల పాకకు నిప్పు

- రెండు పాడి ఆవులు మృతి
- కాలీఫ్లవర్ చోరీపై మందలింపు
- కక్ష కట్టి పశువుల పాకకు నిప్పు..?


పశువుల పాకలో మృతి చెందిన పశువులు

**పలమనేరు:** పశువుల పాకకు నిప్పు పెట్టడంతో రెండు పాడి ఆవులు మృతి చెందిన ఘటన పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మిదొడ్డిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కుమార్ కాలిఫ్లవర్ తోటలో అదే గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి కాలిఫ్లవర్‌ను చోరీ చేస్తుండడంతో వారు హెచ్చరించారు. దీనిపై కక్ష పెంచుకున్న నారాయణ సోమవారం రాత్రి కుమార్ పశువుల పాకకు నిప్పు పెట్టినట్టు చెబుతున్నారు. దీంతో పాకలోని రెండు పశువులు అగ్నికి ఆహుతయ్యాయి. దీనిపై బాధితుడు కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## సంక్షేమ పథకాలు మాకూ వర్తింపజేయాలి

**మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్**

**పలమనేరు:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకూ వర్తింపజేయాలని పలమనేరు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వారు కూటమి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో తాము రూ.13వేల జీతంతో పని చేస్తున్నామన్నారు. తమలాంటి పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయకుండా తొలగించడం చాలా బాధాకరమన్నారు. ఔట్‌సోర్సింగ్‌లో ఉన్నవారిపై సైతం ప్రభుత్వం కొరడా ఝళిపించిందని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. పలువురు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల నిరసన

- కూటమి ప్రభుత్వం ఇచ్చిన బదిలీ జీఓ 5ను రద్దుచేయాలని డిమాండ్
- వార్డు సచివాలయ ఉద్యోగులకిచ్చిన జీఓ వర్తింపజేయాలని వినతి
- సొంత మండలంలోనే బదిలీ చేయాలి


పుంగనూరు ఎంపీడీఓ లీలామాధవికి వినతిపత్రం ఇస్తున్న పుంగనూరు, చౌడేపల్లె మండలాల సచివాలయ సిబ్బంది

**పుంగనూరు(చౌడేపల్లె):** గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 5ను రద్దుచేయాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం పుంగనూరు మండల పరిషత్ కార్యాలయంలో పుంగనూరు, చౌడేపల్లె మండలాల సచివాలయ ఉద్యోగులు సమావేశమమై నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు సొంత మండలానికి బదిలీ చేయకూడదన్న జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. సొంత మండలంలోని సచివాలయ పరిధి కాకుండా వేరొక సచివాలయానికి బదిలీ చేసే అవకాశం కల్పించాలన్నారు. వార్డు సచివాలయాలకు మాత్రం ఒక వార్డు నుంచి మరొక వార్డుకు బదిలీ చేసుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు మాత్రం సొంత మండలంలో బదిలీ చేయకూడదన్న నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. జీఓ 5ను రద్దుచేసి వార్డు సచివాలయాలకిచ్చిన విధంగా తమకూ సొంత మండలాల్లో బదిలీ పొందే విధంగా జీఓ జారీచేయాలని ఎంపీడీఓ లీలామాధవికు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను నివేదించారు.

**వీ.కోటలో..**


వీ.కోట: ఎంపీడీఓ కు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ సిబ్బంది

**వి.కోట :** సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల్లో పనిచేసుకునే అవకాశం కల్పించకుండా ప్రభుత్వం తమపై వివక్ష చూపడం సరికాదని, ప్రభుత్వం వెంటనే బదిలీ జీవో 5ను సవరించాలని మండల సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. సచివాలయ సిబ్బంది ప్రభుత్వం జీఓ నంబర్ 5లో సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల్లో బదిలీ చేయరాదనే నిబంధన విధించడం సరికాదన్నారు. గతంలో మాదిరి సొంత మండలాల్లోనే బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నోటీస్ బోర్డు

**ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం**

- **శాంతిపురం:** అబకలదొడ్డి వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శేషారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూలై 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 17వ తేదీ లోపు ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని 21న అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

### జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

**చౌడేపల్లె:** పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ విత్తనాలను రాయితీ ధరకు రైతుసేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు ఏఓ మోహన్‌కుమార్ మంగళవారం తెలిపారు. 10కేజీల జీలుగ విత్తనాలు రూ.615, 10 కేజీల జనుము విత్తనాలు రూ.545 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డును తీసుకెళ్లాలన్నారు.

### ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలు

**రొంపిచెర్ల:** రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్లకు ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్ మంగళవారం తెలిపారు. 6వ తరగతిలో 9 మంది, 7వ తగరతిలో 22 మంది, 8వ తరగతిలో 9 మంది, 9వ తరగతిలో 10 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఈ వారంలోనే ఫలితాలను డీఈఓ విడుదల చేస్తారని, ఎంపికైన విద్యార్థులను ఆదర్శ పాఠశాలలో చేర్చుకుంటామని ప్రిన్సిపాల్ తెలిపారు.

# మామిడి విలవిల

- మామిడి చెట్ల నుంచి రాలుతున్న కాయలు
- ర్యాంపుల దగ్గర కిలో రూ.2 పలుకుతున్న వైనం
- గిట్టుబాటు ధరలపై నోరు మెదపని ఫ్యాక్టరీలు
- మామిడి రైతుల్లో నైరాశ్యం
- చెట్లను నరికివేస్తున్న వైనం


గిట్టుధరలు లేకపోవడంతో ర్యాంపు దగ్గర ట్రాక్టర్లో ఉన్న కాయలను రోడ్డుపై పారబోసిన రైతు

**తవణంపల్లె:** ఫలరాజుగా ఖ్యాతికెక్కిన మామిడిని పండించిన రైతులు మాత్రం నష్టాలతో విలవిల్లాడిపోతున్నారు. ఈ పంట దిగుబడి ఈ సారి అంచనాలకు మించి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఊహించని స్థాయిలో ధరలు పతనం కావడంతో నష్టాలు మాత్రం తప్పలేదు. మండలంలోని మామిడి రైతులు కాయలను కొనుగోలు చేసే వారు లేక ఫ్యాక్టరీలు, ర్యాంపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మామిడి కాయలు చెట్లలోనే మాగి నేల రాలిపోతుంటే, అధికారులు మాత్రం పక్వానికి వచ్చిన కాయలు కోయాలంటూ చెబుతున్నారు. రైతులు ట్రాక్టర్లకు లోడ్డు చేసి ఫ్యాక్టరీల వద్ద అన్‌లోడ్ చేయడానికి నాటుగురోజుల పాటు నిరీక్షిస్తున్నారు. ఫ్యాక్టరీ యజమానులు ఛాంబర్లు ఖాళీగా లేవని మామాడి కాయల టోకన్లు ఇవ్వకుండా తిరిగి పంపుతున్నారు. రైతులు దిక్కుతోచని స్థితిలో ఆవేదన చెందుతున్నారు.

**చేతులెత్తేస్తున్న ఫ్యాక్టరీ యజమానులు**

ఫ్యాక్టరీల వద్ద సామర్థ్యానికి మించి కాయలు వస్తున్నాయని తర్వాత టోకెన్లు ఇస్తామని నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. ఫ్యాక్టరీల వద్ద ట్రాక్టర్లను అన్‌లోడ్ చేయడానికి సుముఖత చూపడం లేదు. ఫ్యాక్టరీకి రైతులు విపరీతంగా కాయలు తరలిస్తున్నా గట్టుబాటు ధలపై నోరు మెదపడం లేదు. ప్రభుత్వం కిలో మామిడి కాయలకు రూ.4 ఇస్తామని ప్రకటించినా ఫ్యాక్టరీ యజమానులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ధరలు ఏమైనా సరే కాయలను తోలుతామని రైతులు ముందుకు వచ్చినా ఫ్యాక్టరీలు ససేమిరా అంటున్నారు.

**నేలపాలవుతున్న మామిడి కాయలు**

మామిడి కాయలు పండైపోయి కొమ్మల నుంచి నేలరాలిపోతున్నాయి. దీంతో రైతులు మనస్తాపానికి గురవుతున్నారు. కాయలను ఫ్యాక్టరీల యజమానుల తీసుకోకపోవడంతో రైతులు చెట్లలోనే వదిలేయడానికి సిద్ధమవుతున్నారు. మరి కొందరు రైతులు మామిడి చెట్లను నరికి వేయడానికి ఉపక్రమిస్తున్నారు. మాధవరంలో ఓ రైతు కాయలు చెట్టులో ఉండగానే మిషన్‌తో చెట్టునే కోసేశాడు. మామిడి చెట్లను పొలం నుంచి పూర్తిగా తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకోవడానికి పూనుకున్నాడు.

**ప్రభుత్వం విఫలం**

పంటపై ఆధాపడిన మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు మండిపడుతున్నారు. మామిడి పంటను ఫ్యాక్టరీలకు తరలించేందుకు లేక ర్యాంపుల వద్ద విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.


చెట్లను నరికి ఉంచిన మామిడి కట్టె


దిగువమోదలపల్లె దగ్గర చెట్లకిందనే రాలిన మామిడి కాయలు

## డిగ్రీ కళాశాలలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పట్నం సురేంద్రరెడ్డి

**చిత్తూరు కలెక్టరేట్ :** కూటమి ప్రభుత్వం డిగ్రీ కళాశాలల విషయంలో చిన్నచూపు చూడటం అన్యాయమని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నం సురేంద్రరెడ్డి అన్నారు. ఆ సంఘం నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇంజినీరింగ్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ డిగ్రీ కళాశాలలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా కూటమి ప్రభుత్వం ఇంత వరకు కళాశాలలకు ఫీజు బకాయిలు చెల్లించలేదన్నారు. స్కూల్ విద్యార్థులకు రూ.13 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.13 వేలు డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం తగునా? అని ప్రశ్నించారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే ఉన్నత విద్యార్థుల భవిష్యత్, కళాశాలల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ విద్యకు ఇచ్చినంత ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం డిగ్రీ కళాశాలలకు ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.